www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 నవంబర్ 2025

5

తూర్పుగోదావరి



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నవంబర్ 17న (సోమవారం) యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు ఇవ్వడమే కాక, గత అర్జీల స్థితి కూడా తెలుసు కోవచ్చని చెప్పారు. అదనంగా meekosam.ap.gov.in ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారం కోసం 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ సేవను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ముద్దలోకి రాని మెనూ

హాస్టల్స్‌లో కానరాని పారదర్శకత
తక్కువ ధరలకు టెండర్ల ఆమోదం
ఆపై విద్యార్థులకు ఎగనామం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో వసతి గృహ విద్యార్థులకు మెనూ అమలు కావడం లేదు. హాస్టల్స్‌లో మెనూ అమలుపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వెక్కిరిస్తున్నాయి. భోజన వసతికి కావాల్సిన సరుకులు సరఫరా చేసే టెండర్లు తక్కువ ధరకు వేయడం, ఆపై పర్యవేక్షణ లేకపోవడంతో కూరగాయలు, నిత్యావసర సరుకుల సరఫరాలో నాణ్యత లోపిస్తోంది. జిల్లాలో వెల్ఫేర్ హాస్టల్స్‌లో విద్యార్థుల భోజన వసతి కోసం తక్కువ ధరకు కూరగాయలకు టెండర్ ధరలు పరిశీలిస్తే విస్మయానికి గురికాక తప్పదు. కూరగాయలు కిలో రూ.10 చొప్పున సరఫరా చేస్తానని టెండర్‌లో స్పష్టం చేశారు. మొత్తం 26 రకాల దినుసులు కేవలం రూ.305కే అందజేస్తానని వెండర్ అంగీకరించారు. కాగా.. అమలు కాని ధరలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్న ఆలోచన లేకుండా అధికారులు ఓకే చేయడం చర్చనీయాంశమవుతోంది. వాస్తవంగా మార్కెట్‌లో కంటే కిలో కూరగాయలు లేదా ఇతర దినుసులకు రూపాయి నుంచి కనీసం రూ.10 వరకు మార్జిన్ ఉంటుంది. కానీ ఇక్కడ 26 రకాల దినుసులలో 22 రకాలను.. అందులో ఒక్కోటి కిలో రూ.10కే సరఫరా చేసేస్తామని టెండర్ వేయడం.. అధికారులు ఖరారు చేసేయడం గమనార్హం. మార్కెట్‌లో ఏ ఒక్క కూరగాయలు కూడా అరకిలో కూడా రూ.10కి లభించడం లేదు. కొన్ని కూరగాయల ధరలు పరిశీలిస్తే తాజాగా కార్తీక మాసం నేపథ్యంలో రూ.వందకు సమీపంలోనూ.. మరికొన్ని రూ.వంద పైబడే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంత తక్కువ ధరకు టెండర్లు ఎలా ఆమోదించారనేది ప్రశ్నార్థకమవుతోంది. కిలో రూ.10 చొప్పున కూరగాయలను అధికంగా టెండర్ అగ్రిమెంట్ పత్రాలలోనే.. ఆపై బిల్లులలో సరఫరా చేసినట్లు ఉంటుంది. కానీ వాస్తవంగా కొన్ని కూరగాయలను విద్యార్థులు రుచి కూడా చూసి ఎరుగరు. అధికారులు కనీసం నెలకోసారి హాస్టల్‌లో తనిఖీలు చేపట్టి, కూరగాయల సరఫరా, వంట సక్రమంగా సాగుతుందో లేదో విచారణ చేపడితే అసలు విషయం తెలుస్తుంది. ఈ దుస్థితిని చక్కదిద్దే పరిసితి ఉంటుంది.

కూరగాయలు	టెండర్ ధర	మార్కెట్ ధర
వంకాయ	రూ.10	రూ.40
బెండకాయ	రూ.10	రూ.40
క్యాబేజీ	రూ.10	రూ.30
దొండకాయ	రూ.10	రూ.35
బీరకాయ	రూ.10	రూ.35
కాలిఫ్లవర్	రూ.10	రూ.45
ఆనబకాయ	రూ.10	రూ.25
పొడుగు చిక్కుడు	రూ.10	రూ.30
టమోటా	రూ.10	రూ.40
చిక్కుడు	రూ.10	రూ.60
బంగాళాదుంప	రూ.15	రూ.20
ఉల్లిపాయ	రూ.10	రూ.25
క్యారెట్	రూ.10	రూ.40
బీట్‌రూట్	రూ.10	రూ.40
పచ్చిమిర్చి	రూ.10	రూ.60

హోల్‌సేల్ కన్నా తక్కువ.. ఇక్కడెట్లా ...

హోల్ సేల్ మార్కెట్‌లో కూడా కూరగాయల ధరలు భారీగానే ఉన్నాయి. అల్లం కిలో రూ.90పైగా ఉండగా.. కేవలం రూ.10కే ఎలా సరఫరా చేయగలరన్నది అనుమానమే. ఇక పందిరి చిక్కుడు, ఎర్రదుంప, పొడువు చిక్కుడు, పొటల్స్, బీరకాయ వంటివి ఉత్తిమాటే అన్న ఆరోపణలు ఉన్నాయి. వంకాయ, బెండకాయలు, క్యారెట్, బీట్‌రూట్, ఇతర కూరగాయలన్నీ.. అక్కడక్కడ కరివేపాకు మాదిరిగా కూరలో కనిపిస్తుంటాయి. ఇలా అయితే విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా అనే ప్రశ్న తలెత్తుతోంది. నిమ్మకాయలు అసలు వినియోగించే పరిస్థితి లేదు. కానీ, వాటి ధర మోస్తరుగా ఇవ్వడం కొసమెరుపు. పాఠశాల విద్యార్థికి రూ.42 చొప్పున.. ఇంటర్ విద్యార్థికి రూ.46 చొప్పున రోజుకి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. కానీ టెండర్‌దారుడు ఆశ కొద్దీ దరఖాస్తులు పెట్టినా.. వాస్తవ పరిస్థితిని తెలుసుకుని అమలు సాధ్యమా కాదా అన్నది అధికారులు పరిశీలించాలి. బహిరంగ మార్కెట్‌లో ధరల కంటే కనీసం సగానికి కేటాయించినా విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. టెండర్ ఖరారు మేరకు కూరగాయలను సమృద్ధిగా సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. టెండర్ ఇచ్చినంత మేరే స్కూల్స్‌లో విద్యార్థులకు వండి పెట్టాలి. ఉదాహరణకు క్యారెట్ చాలదు.. మరో పది కిలోలు సరఫరా చేయండని వార్డెన్ లేదా ప్రిన్సిపల్ టెండర్‌దారునికి చెప్పినా వినని పరిస్థితి. స్కూల్‌కు సరిపడా కూరగాయలు అవసరం మేరకు ఇవ్వాల్సిందేనని గట్టిగా అడగలేని దుస్థితి. కాంట్రాక్టరు కూడా కొన్ని కూరగాయలు నాణ్యత లేనివి సరఫరా చేస్తున్నారు.

హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

అమలుకు నోచుకోని మెనూ

ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహాల్లో మెనూ అమలు చేయాలి. ప్రతి రోజూ ఉదయం పాలు, వారంలో ఆరుసార్లు కోడిగుడ్లు, వారంలో రెండు రోజులు చికెన్‌తో విద్యార్థులకు భోజనం వడ్డించాలి. ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ అందజేయాలి. ఇవన్నీ హాస్టల్స్ బోర్డుకే పరిమితం అవుతున్నాయి. ఉదాహరణకు చికెన్ వడ్డించిన రోజున ఒకొక్క విద్యార్థికి ఒకటి లేక రెండు ముక్కలకు మించి లభించడం లేదు. మరి కొన్ని హాస్టల్స్‌లో వడ్డించిన కూరల్లో నాణ్యత లేకపోవడంతో కాలేజీ విద్యార్థులు కర్రీ పాయింట్స్ నుంచి కూరలు తెచ్చుకుని భోజనం చేస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పాలనా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలూ విజ్ఞప్తి చేస్తున్నాయి. రాజమహేంద్రవరం వై.జంక్షన్ సమీపంలోని ఎస్‌సి హాస్టల్లో 90 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆదివారం చికెన్ కర్రీ, బిర్యాని, పెరుగు చట్నీ, గోంగూర చట్నీ పెట్టాలి. కానీ అక్కడ చికెన్ కర్రీ, నాణ్యత లేని బిర్యాని రైస్ మాత్రమే వడ్డించారు. కడియంలోని ఒక హాస్టల్లో మెనూ అమలు చేస్తున్నారు.

2047కు స్వర్ణ నిడదవోలు : మంత్రి

ప్రజాశక్తి-నిడదవోలు

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా స్వర్ణ నిడదవోలు సాధించే దిశగా పని చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. నిడదవోలు పట్టణ మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాల్లో భాగంగా 5కె రన్ అండ్ వాక్‌ను ఆదివారం ఆయన పట్టణంలోని పార్క్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. పావురాలు ఎగరవేశారు. తెల్లవారు ఝామునే మంత్రి దుర్గేష్‌తో పాటు వజ్రోత్సవాలకు వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, ప్రజలు, కూటమి నాయకులు వజ్రోత్సవ టి షర్ట్, క్యాప్‌లు ధరించి ఉత్సాహంగా రన్ అండ్ వాక్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వజ్రోత్సవాల ప్రారంభానికి ముందు ఆరోగ్యానికి ఉపయోగపడే 5కె రన్ ఏర్పాటు చేసుకోవడం, ఈ క్రమంలో పట్టణంలోని ప్రజలను భాగస్వామ్యులను చేయడం శుభారంభం అన్నారు. ఈ ఏర్పాట్లు చేసినందుకు పురపాలక సంఘాన్ని అభినందించారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో వజ్రోత్సవాల్లో పలువురు రాష్ట్ర మంత్రులు, నాయకులు, ముఖ్యమైన వ్యక్తులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధ్యాత్మిక సంస్థలు, వ్యాపార వర్గాలు, ప్రజలు పాల్గొంటారని తెలిపారు. వజ్రోత్సవా వేళ నిడదవోలు పట్టణాభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్నామని, భారీ ఎత్తున పాల్గొని వజ్రోత్సవాలకు సహకరించాలని ప్రతి ఒక్కరినీ కోరారు. రాబోయే రోజుల్లో నిడదవోలును అద్భుతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోదీ వికసిత్ భారత్‌ను, సిఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సహకారంతో పలు కార్యక్రమాలు చేపడుతు న్నారన్నారు. ఈ క్రమంలో స్వర్ణ నిడదవోలుకు బాటలు వేద్దామని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. నిడదవోలు పార్క్ వద్ద ప్రారంభమైన 5కె రన్ అండ్ వాక్ గణేష్ చౌక్ సెంటర్ మీదుగా ఎస్‌విఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వరకూ కొనసాగింది. అనంతరం అదే రూట్ మీదుగా ఓవర్ బ్రిడ్జి చివరి వరకూ చేరుకుని నిడదవోలు పార్క్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ ఎత్తున స్పందన వచ్చింది. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రంగా రమేశ్, టిడిపి అధ్యక్షులు కారంకి నాగేశ్వరరావు, వామపక్ష నాయకులు జువ్వల రాంబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

5కె వాక్‌లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

విసి ప్రసన్నశ్రీకి రామోజీ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రతిష్టాత్మకమైన రామోజీ ఎక్సలెన్స్ అవార్డు-2025 అందుకున్నారు. రామోజీరావు జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాదులోని రామోజీ ఫిలిం సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా విసి ఈ అవార్డు అందుకున్నారు. ముఖ్య అతిథులుగా ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ, కేంద్ర ప్రభుత్వ పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రామోజీ గ్రూప్ చైర్మన్ అండ్ డైరెక్టర్ కిరణ్ హాజరయ్యారు. అంతరించిపోతున్న గిరిజన భాషలకు లిపిని రుపొందించి, సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా రూ.10 లక్షల నగదు, అవార్డు, జ్ఞాపికతో విసి ప్రసన్నశ్రీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామోజీ ఎక్సలెన్స్ అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విసి ప్రసన్నశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో నేటి నుంచి లెప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శించి, ఆయా ఇళ్లల్లో కొత్తగా శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే వాటిని పరీక్షించి, డాక్టర్లకు చూపిస్తారన్నారు. నిర్ధారణ అయితే వారికి 6 నెలల కోర్సు టాబ్లెట్స్ రూపంలో ఉచితంగా చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ చికిత్సతో వారికి ఆ వ్యాధి నుంచి పూర్తిగా రక్షణ కలుగుతుందని తెలిపారు. ప్రాథమిక దశలోనే గుర్తించి, మందులు క్రమం తప్పకుండా 6 నెలల కాలం వాడి, పూర్తిగా నయం చేయవచ్చన్నారు.

కృష్ణశాస్త్రి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కడియం

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, మాజీ సైనికాధికారి, గాదాలమ్మ నగర్ గురువుగా పేరుగాంచిన పెయ్యల కృష్ణశాస్త్రి సేవలు ప్రశంసనీయమని ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ అన్నారు. కార్తీక వన సమారాధనలో భాగంగా ఆదివారం కృష్ణశాస్త్రి తన శిష్య బందంతో మార్గాని నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణశాస్త్రి మాట్లాడుతూ దేశ సేవ, దైవసేవ, మాతృపితృ సేవ సమంగా చేసినప్పుడే ఆ జీవితానికి పరమార్థం ఉంటుందని పేర్కొన్నారు. పచ్చని వనాల మధ్య కార్తీక మన సమారాధన జరుపుకునే అవకాశం కల్పించిన మార్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-కొవ్వూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విస్మరించిందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తలారి వెంకట్రావు విమర్శించారు. కొవ్వూరు మండలం తొగుమ్మి గ్రామంలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 512 రోజులు గడుస్తోందని, ఇంతవరకూ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని చెప్పిన హామీని ఏం చేశారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పింఛన్లు అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా అమలు చేశారన్నారు. కరోనా వంటి విపత్తులను ఎదుర్కొన్నప్పటికీ సంక్షేమ పథకాలకు ఏ రోజూ కోత విధించకుండా సకాలంలో పథకాలు లబ్ధిదారులకు అందించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం మోసపూరితమైన మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వైసిపి నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు, పార్టీ మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్ కుమార్, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి నాగరాజు, మద్దుకూరి రవిప్రసాద్, జుట్ట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తొగుమ్మిలో నిర్వహించిన కార్యక్రమంలో తలారి వెంకట్రావు

కైవల్య రెడ్డిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కైవల్యరెడ్డికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైన కుంచాల కైవల్య రెడ్డిని అభినందిస్తూ తన భవిష్యత్ చదువు నిమిత్తం రూ.50 వేల సాయం స్కాలర్‌షిప్ చెక్ రూపంలో అందించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే విద్యార్థులను ప్రోత్సహించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందని, నిడదవోలుకు గర్వకారణంగా నిలిచిన కైవల్యారెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి, ప్రోత్సాహకాన్ని అందించినట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కరుటూరి చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా కైవల్య, ఆమె కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్, సెక్రటరీ గారపాటి మోహన్, ట్రెజరర్ మట్టపర్తి చంద్రరావు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు.. బెర్మ్‌లు మరిచారు..

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన జీవన ప్రమాణాల కోసం కూడమి ప్రభుత్వం గ్రామంలో సిసి రోడ్లు వేసినప్పటికీ, రోడ్లకు ఇరువైపులా బెర్మ్‌లు వేయకపోవడంతో స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజాధనం వథా అవుతోందని స్థానిక రైతులు అంటున్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సుమారు ఏడు నెలల క్రితం జిల్లా పరిషత్ నిధులతో రఘదేవపురం నుంచి ముగ్గళ్ళ వరకూ సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీని అంచనా విలువ రూ.240.000 లక్షలు. 3.5 కిలోమీటర్ల గల ఈ రోడ్డును 15.1/2 అడుగుల వెడల్పుతో నిర్మించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ కేవలం 12 అడుగుల వెడల్పుతో తూతూ మంత్రంగా నిర్మించారని రైతులు ఆరోపిస్తున్నారు. సిసిమ రోడ్డు పనులు పూర్తి చేసినా, దాదాపు ఆరు నెలల నుంచి రోడ్డు సైడ్ బెర్మ్‌లకు మట్టి పోయలేదు. ఈ రోడ్డుకు ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథులుగా శంకుస్థాపన చేసినప్పటికీ, పనులు మాత్రం అసంపూర్తిగా మిగిలిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టి లేకపోవడంతో ప్రధానంగా వ్యవసాయదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ పలు రకాల ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వాహనం వెళితే మరొక వాహనం తప్పించుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ వాహనాలు రోడ్డుపైకి ఎక్కడానికి, దిగడానికి ఇబ్బంది పడుతుండటంతో పంట నష్టాలు కూడా ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. రోడ్డుకిరువైపులా ఆధారం లేకపోవడంతో, వాహనాలు వెళు తున్నప్పుడు సిసి రోడ్డుకు పగుళ్లు వచ్చి ధ్వంసమవుతోందని, ఇది నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు సూచిస్తోందనిగ్రామ ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, తక్షణమే రోడ్డుకు ఇరువైపులా నాలుగు అడుగులు చొప్పున మొరం మట్టి పోయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల ప్రజాధనం వథా అయ్యిందని స్థానికులు చెబుతున్నారు. నిర్మించిన సిసి రోడ్డుకిరువైపులా కుంగిపోయి దెబ్బతినకుండా, మొరం మట్టి పోసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మీదుగా నీటమునిగిన వరి పంట రైతుల పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రస్తుత జిల్లా కలెక్టర్ ప్రయాణించినప్పుడు తమ ఇబ్బందికర పరిస్థితిని నేరుగా చూశారని గుర్తు చేస్తున్నారు.

రోడ్డుకిరువైపులా బెర్మ్‌లు లేవని చూపిస్తున్న రైతులు

పూర్వ విద్యార్థుల కలయిక

1983 పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. వారి కలయికకు పల్ల వెంకన్న నర్సరీ వేదికైంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని, 42 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వారు, కుటుంబ సమేతంగా కలుసుకుని ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ, ఆనాటి సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ వేడుకకు సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులు తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ మిత్రులతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో పల్ల సత్యనారాయణ, మార్ని సత్యనారాయణ, కర్రి రాజు, తాడాల ఆదినారాయణ, సర్కార్ బాషా, వట్టికూటి ప్రసాద్, రావిపాటి శ్రీనివాస్, గుత్తుల సత్యనారాయణ, గొర్రెల వేణు, బివి.కుమార్, పచ్చిమట్ల సత్యనారాయణ రాజు, పరిమి ఆదిష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

58వ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం కొనసాగాయి. పలుచోట్ల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

నిడదవోలు నిడదవోలు శ్రీనందిన సుబ్బారావు లీలావతి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా ఆధునిక యుగంలో గ్రంథాలయాల ఆవశ్యకతపై చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చా గోష్టి లో గ్రంథాలయ ఆవశ్యకతను మారుతున్న సమాజానికి తగిన విధంగా గ్రంథాలయాలను ఏ విధంగా పాఠకులకు ముందుకు తీసుకురావాలో చర్చించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కథలు, వేమన శతకాలు వివరించే కార్యక్రమంలో అందరం కలిసి పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.గురుమూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్‌వి.రమణ, వి.మోహనకృష్ణ, ఎవి.రమణ, సానెపు వెంకట సుబ్బారావు, దిడ్ల శ్రీనివాస రావు, గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు, గాలి రాఘవయ్య పాల్గొన్నారు.

చాగల్లు చంద్రవరం శాఖ లైబ్రరీలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సెక్రటరీ కాసాని వెంకటేశ్వరరావు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు నిడదవోలు సత్యనారాయణ, గ్రంథ పాలకుడు కె.సుమన్ కుమార్ విద్యార్థులకు నివాళులర్పించారు..

పెరవలి మండలం ముక్కామల, తీపర్రు, పెరవలి శాఖా గ్రంథాయాల్లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులకు నివాళులర్పించారు. రిటైర్డ్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ముళ్లపూడి బుల్లచ్చన్న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల కృషి ఫలితంగానే గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయని, ఈ కార్యక్రమంలో దాసరి రామకృష్ణ, గండి రామచంద్రరావు, కరటూరి కాశీ విశ్వనాథం, గంజి రామచంద్రరావు, గ్రంథపాలకులు ఎం.వెంకటేశ్వర్లు సిహెచ్.విజయలక్ష్మి కె.వెంకటేశులు పాల్గొన్నారు.

ఆవపాడు గ్రామాభివృద్ధే ధ్యేయం

సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ

ప్రజాశక్తి-నల్లజర్ల

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు మండలంలోని ఆవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ తెలిపారు. ఆయన చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వివరించారు. జిల్లా పరిషత్ నుంచి రూ.కోటీ 86 లక్షల గ్రావెల్ రోడ్స్. ఎన్ఆర్‌జిఎస్ నిధుల నుంచి రూ.3.85 లక్షలు బిటి రోడ్లు వేసినట్టు తెలిపారు. పంచాయతీ మంచినీరు బోర్లు వేసినట్టు తెలిపారు. రూ.3 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు సిసి రోడ్లు మరియు బోర్లు, గ్రామంలో రూ.42 లక్షలతో వాటర్ ట్యాంకు, 9 కిలోమీటర్లు మేర రూ.1.50 లక్షలతో పైపులైన్లు వేయించినట్టు తెలిపారు. సుమారు రూ.10 లక్షల సొంత నిధులతో అంబేద్కర్ మండపం, రూ.2 లక్షలతో బిసి కాలనీలో బస్ స్టాప్ నిర్మించినట్టు తెలిపారు. రూ.5 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్, రూ.50 వేలతో ఒసి శ్మశాన వాటిక, రూ.50 వేలతో రచ్చబండ కట్టించినట్టు చెప్పారు. శ్మశాన వాటికలో ఏడేళ్లపాటు ఉచితంగా పుల్లలు అందించేందుకు సాయం చేస్తున్నామన్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి తక్షణమే ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో తన పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా సహకరించిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్ సత్యనారాయణ

ఘనంగా కార్తీక వన మహోత్సవాలు

ప్రజాశక్తి-పెరవలి

గోదావరి పరీవాహక లంక గ్రామాల్లో ఆదివారం కార్తీక వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. తీపర్రు పుష్కర్ ఘాట్ ఏరియాలో తణుకు సజ్జాపురం దస్తావేజుల లేఖర్ల వనభోజనాలు నిర్వహించారు. ముక్కామల గోదావరి ఏటిగట్టు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ముక్కామల భక్తాంజనేయ స్వామి సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాలైన ఉమ్మడివారిపాలెం, ముత్యాలవారిపాలెం, నల్లాకులవారిపాలెం గ్రామాలకు చెందినవారు వన సమారాధన లో పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు చేస్తున్న మహిళలు

సారాపై ఉక్కుపాదం

'ప్రజాశక్తి'తో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో సారా రవాణా, తయారీపై తమ శాఖ ఉక్కుపాదం మోపిందని, దానిలో భాగంగా అక్రమ సారా తయారీ, అమ్మకాలను ఎప్పటికప్పుడు నివారిస్తూ దాడులు చేస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి తెలిపారు. దీనికోసం గత టీడీపీ ప్రభుత్వం 2016లో అమలు చేసిన నవోదయం కార్యక్రమాన్ని కూటమి సర్కారు పునరుద్ధరించినట్లు తెలిపారు. నవోదయం 2.0 పేరిట ఎక్కడికక్కడే సారా తయారీ, రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. ఇప్పటికే పాత నేరస్తులను బైండోవర్ చేశామన్నారు. సారా బాధిత గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇంకా పలు అంశాలను ఆమె 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

అక్రమ మద్యం కేసులు ఎన్ని? ఎంతమందిని అరెస్టు చేశారు?

ఎక్సైజ్ శాఖను ఎపి ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఒకే లైన్ ఆఫ్ ఫోర్స్‌గా ఏకీకృతం చేసింది. జిఒ నంబర్ 188 ప్రకారం తాగడానికి పనికిరాని ప్రయోజనాల కోసం మద్యం తయారీతో సహా మత్తు పదార్థాల ఉత్పత్తి, అమ్మకం, రవాణా వినియోగాన్ని నియంత్రించింది. దీనిలో భాగంగా గతేడాది అక్టోబర్ 1 నుంచి ఈనెల 9 వరకూ జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం, సారా, బెల్లం ఊటలను ధ్వంసం చేసి 2,359 కేసులు బనాయించాం.1813 మందిని అరెస్టు చేశాం.

సారా కేసులు ఎన్ని?

జిల్లాలో గడచిన 3 నెలల కాలంలో నాటు సారా తయారీ, అమ్మకాలు జరిపిన వారిపై పెద్ద ఎత్తున కేసులు పెట్టాం. ఈ కేసుల్లో పలువుని మందిని అరెస్టు చేసి వారి నుంచి 11,201 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నాం. 7 లక్షల 52 వేల 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగింది.123 వాహనాలను సీజ్ చేశాం.

బెల్ట్ షాపులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

గత ఏడాది కాలంలో 3 కంటే ఎక్కువ మద్యం బాటిళు కలిగి ఉంటే నిబంధనలకు విరుద్ధం. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు బెల్ట్ షాపుల కలిగిన వారిపై కేసులు పెట్టాం. ఈ కేసుల్లో 1057 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం.

ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలపై చర్యలు?

యానాం, తెలంగాణ రాష్ట్రాల నుంచి మన జిల్లాకు అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని గుర్తించి అరెస్టు చేశాం. 1661 లీటర్ల యానాం మద్యంను స్వాధీనం చేసుకోగా కొన్ని గంజాయి కేసుల్లో 19.03 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నాం.

అక్రమ మద్యంపై ఎటువంటి చర్యలు?

ప్రజారోగ్యం, సామాజిక, శాంతి భద్రతల పరిరక్షణను ప్రధాన కర్తవ్యంగా తీసుకొని అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై, సారా, కల్తీ కల్లు, అనుమతి లేని మద్యం దుకాణాలపై నిరంతరం దాడులు జరిపి అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 7 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్స్, ఇఎస్ టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు అన్ని ఏ4 మద్యం షాపులు, బార్లు పర్మిట్ రూములు ఇండస్ట్రియల్ ఏరియాలు, పాడుబడ్డ భవనాలు, మారుమూల ప్రాంతాలలోని అనుమానిత బిల్డింగ్స్ కుణ్ణంగా తనిఖీ చేయడం ద్వారా జిల్లాలో నకిలీ మద్యం తయారీ, అమ్మకం వంటి కార్యకలాపాలు ఉంటే చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ మద్యం, స్పిరిట్, ఇతర నకిలీ మద్యం తదితరాలు జిల్లాలోనికి ప్రవేశించకుండా, తయారు కాకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా నిరోధించడం జరుగుతున్నది.

పర్యవేక్షణ ఎలా చేస్తున్నారు?

జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలను అరికట్టడం కోసం ప్రత్యేక బృందాలు నిరంతర పర్యవేక్షణతో ఎప్పటికప్పుడు దాడులు జరుపుతూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల నియంత్రణ కోసం నిరంతరం కృషి చేస్తున్నాం.

కాకినాడ జిల్లాలో 171 మద్యం పాపులు, 9 బార్లలో మద్యం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది. మద్యం దుకాణాలు ప్రారంభం నుంచి అంటే గతేడాది అక్టోబర్ 16 నుంచి ఇప్పటి వరకు 1343 శాంపిల్స్ ను సేకరించి వాటిని రీజనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ల్యాబొరేటరీకి పంపి నివేదికలను పొందడం జరిగింది. ఈ నివేదికలలో ఎక్కడా కల్తీ మద్యం ఆనవాళ్ళు లభించలేదు.

నకిలీ మద్యాన్ని ఎలా గుర్తించాలి?

ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎక్సైజ్ సురక్ష యాప్‌ను విడుదల చేశారు. ఎవరైనా మద్యం బాటిళ్ల కొనుగోలు చేసినపుడు అనుమానం వస్తే ఇ యాప్ ద్వారా మూత మీద ఉన్న హీల్‌ని మాత్రమే స్కాన్ చేయాలి. దీని ద్వారా కొనుగోలు చేసిన మద్యం బాటల్ సరైనదా నకిలీదా తెలుసుకోవచ్చు. ఒకవేళ నకిలీదయితే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 14405 కు తెలియజేయాలి. నాటుసారా, కల్తీ కల్లు తయారీని అరికట్టడంలో ప్రజల సహకారం అత్యవసరం. ఏదైనా అనుమానాస్పద మద్యం తయారీ, విక్రయాల గురించిన సమాచారం ఉన్నట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫోన్ ద్వారా గానీ, లేదా సమీప ఎక్సైజ్ స్టేషన్‌లో గానీ తెలియజేయాలి.సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు.

నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎలా అమలు చేస్తారు?

నవోదయం 2.0 కార్యక్రమాన్ని మూడు విభాగాలుగా విభజించారు. వాటిలో ఒక్కో గ్రామాన్ని ఎక్సైజ్ అధికారులు దత్తత తీసుకోనున్నారు. పాత కేసుల్లో ముద్దాయిల నేర చరిత్ర, ఆ గ్రామ స్వరూపం తెలుసుకుంటారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. విఆర్ఒ, విఆర్ఎ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. నేర చరిత్ర ఉన్నవారిని పిలిచి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తారు. కలెక్టర్, ఎస్‌పి, ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో వారికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేస్తారు.

నేరాలు ఘోరాలు

బాలికపై లైంగిక దాడి : నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాక, ఆమెను బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు రఘుదేవపురం గ్రామానికి చెందిన నిందితుడు గడుసుల నాగ వెంకటేష్, అతని తల్లి రమణపై పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటర్ చదివిన ఒక బాలిక ఎయిర్ హోస్టెస్ కోచింగ్ కోసం విశాఖపట్నంలో ఉంది. ఏడాది క్రితం వెంకటేష్‌కు ఆమె వాట్సాప్‌లో పరిచయమైంది. దీంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని వెంకటేష్ నమ్మించాడు. సంవత్సర కాలంగా ఆమె నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేశాడు. గత అక్టోబర్ 31న ఇంటర్వ్యూ పేరుతో మాయమాటలు చెప్పి బాలికను హైదరాబాద్ తీసుకువెళ్లాడు. అక్కడ ఒక హోటల్‌లో వారిద్దరూ కలిసి దిగిన ఫోటోలు, వీడియోలను నెట్‌లో పెడతానని బెదిరించి ఆమెపై మూడు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను రఘుదేవపురం తీసుకువచ్చాడు. బాలిక ఫిర్యాదు మేరకు వెంకటేష్‌ను పోలీసులు ఆదివారం అదుపులోనికి తీసుకున్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి - నల్లజర్ల

ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి లోపలికి చొరబడి ఎనిమిది కాసులు బంగారం రూ.50 వేల నగదు అపహరించిన సంఘటన మండలంలోని అచ్చన్నపాలెంలో చోటు చేసుకుంది. ఎస్‌సి కాలనీకి చెందిన బోడి గడ్డ ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ కొద్ది రోజులు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది వచ్చారు. అనంతరం రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంట్లో నగలు, నగదు దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించినట్టు ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక అంబేద్కర్ నగర్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. అంబాజీపేటకు చెందిన పరమట ఏసురత్నం (65) బైకుపై అమలాపురం నుంచి అంబాజీపేట వెళుతున్నాడు. ఈ సమయంలో కాకినాడ నుంచి భీమవరం వైపు వెళుతున్న కంటైనర్ వెనుక నుండి ఢీకొంది. దీంతో ఏసురత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కరప

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధితులకు మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ పంతం నానాజీ అందజేశారు. ఆదివారం గుడారిగుంటలోని ఆయన కార్యాలయంలో సుమారు రూ.10.98 లక్షల విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంతం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా వచ్చిన ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం సహాయం అందజేస్తోందని అన్నారు. ఇప్పటివరకు 182 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 135 మందికి సుమారు రూ.1.34 కోట్లను బాధితులకు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కరప ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, నాయకులు పుల్ల శ్రీరాములు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయానికి ఆదివారం యాత్రికులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి యాత్రికులు ఆలయానికి విచ్చేశారు. యాత్రికులకు అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యాత్రికులకు ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లును డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐ జయశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గారగారావు పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీశ్ మోహన్ తెలిపారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

వేళంగి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బి.వెంకన్నరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేళంగి గ్రామంలోని శ్రీనివాస నర్సింగ్ హోం ఆవరనలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కోడిరి రంగారావు సుబ్బలక్ష్మి, జగ్గంపేట లైన్ డిస్టిక్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో లైన్ గ్రంధి వెంకటేశ్వరరావు సౌజన్యంతో ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయాభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామంలో స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాలస్వామి వార్ల ఆలయ అభివృద్ధికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన గన్నవరపు సత్య సుబ్బారావు, లక్ష్మి దంప తుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.5 వేలు ఇఒ భాగవతుల వెంకటరమణమూర్తికి ఆదివారం అందజేశారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రం అందజేశారు.

ధర్మకర్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

బాల బాలాజీ ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- మామిడికుదురు

అప్పనపల్లి శ్రీబాలబాలాజీస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా ఆలయ వ్యవస్థాపకులు దేవదూత మొల్లేటి రామస్వామి తనయుడు మొల్లేటి లక్ష్మీనారాయణ (చక్రి) ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీనారాయణ చేత ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ధర్మకర్త దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించి శ్వేతవస్త్రం కట్టి సత్కరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ధర్మకర్తకు ఆలయ మర్యాదలతో అర్చక స్వాములు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు.

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా

మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు లక్ష్మీనారాయణ(చక్రి) పూలమాలలు సమర్పించి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా చక్రి మాట్లాడుతూ తన తండ్రి రామస్వామి ఆశయాల అనుగుణముగా యాత్రికులకు మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఉద్యోగులు నూతన ధర్మకర్తకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన సీనియర్ నాయకులు కెఎం.రజా(రజ్వి), కె.నరసింహారావు, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు ధర్మకర్తను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కళాకారులను సత్కరించిన వంశపారంపర్య ధర్మకర్త

కార్తీకమాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం టీచర్ ఉమాదేవి పర్యవేక్షణలో అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన అమృతేశ్వర నాట్యఅకాడమీకి చెందిన చిన్నారులు చేసిన ఆంధ్ర నాట్యం, శాస్త్రీయ నృత్యం యాత్రికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నూతన ధర్మకర్త లక్ష్మీనారాయణ చిన్నారులకు స్వామివారి కండువాలు కప్పి ఘనంగా సత్కారించారు.



ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తూకం వేసి ట్రాక్టర్‌పై తరలిస్తున్న రైతులు

ముమ్మరంగా మాసూళ్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

తుపాను ముంపు విడనాడి వాతావరణం పొడిగా ఉండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఎప్పటికీ పెద్ద ఎత్తున రైతులు తొలకరి ధాన్యాన్ని మాసూళ్లుచేస్తున్నారు. మరోవైపు వాతావరణం మళ్లీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో రైతులంతా వరి కోతలు కోస్తున్నారు. రామచంద్రపురం కె.గంగవరం కాజులూరు మండలాల్లో ఇప్పటికే 50 శాతం వరకు వరి కోతలు పూర్తి చేశారు. తుపాను వల్ల బాగా పడిపోయి, నేల వాలిన వరి చేలను సాంప్రదాయ కోతలు కోయిస్తుండగా, మరోవైపు హార్వెస్టర్ల సాయంతో రాత్రి, పగలు వరి కోతలు పూర్తి చేస్తున్నారు. ఇక హార్వెస్టర్ల సహాయంతో వరి కోతలకు వేయడంతో పనులు కట్టడం కుప్పలు వేయడం నూర్పిడి చేయటం వంటి పనులకు రైతులు స్వస్తి పలికారు. హార్వెస్టర్ల సహాయంతో నేరుగా పంట కోసి ధాన్యం సేకరించడం వల్ల వచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటే సరిపోతుంది. ఆరబెట్టడం ధాన్యాన్ని నేరుగా మిల్లకు అమ్మకాలు కొనసాగించే వీలు ఉడటంతో అధిక శాతం రైతులు హార్వెస్టర్ల సహాయంతోనే వరి కోతలు పూర్తి చేస్తున్నారు. ప్రస్తుత వారం రోజులుగా వాతావరణం ఎండలు కాస్తూ కోతలకు అనుకూలించడంతో వ్యవసాయ పనులు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఈనెల 25 నుంచి మళ్లీ వర్షాలు కురుస్తాయని అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు పెద్ద ఎత్తున మాసూళ్లు చేస్తున్నారు. వీలైనంత త్వరగా ధాన్యాన్ని ఆరబెట్టుకుని రైస్ మిల్లులకు తరలించే పనులలో నిమగ్నం అయ్యారు. దీంతో వ్యవసాయ కూలీలు రైతులు అంతా పొలాల్లోనే బిజీ బిజీగా గడుపుతున్నారు. మరోవారం పది రోజులు ఎండలు కాస్తే 90 శాతం పైగా రైతులు తమ ధాన్యాన్ని మాసూళ్లు చేసుకుని పంటను అమ్ముకునే అవకాశం ఉంటుందని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. మొంథా తుపాను ప్రభావంతో ఎప్పటికీ 60 నుంచి 70 శాతం వరిచేలు నేల వాలిన మిగిలిన పంటను రైతులు చేతికి దక్కించుకునేందుకు రైతులు శ్రమిస్తున్నారు.

జనార్ధన స్వామి ఆలయంలో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని వైఖానస సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనార్ధన స్వామి ఆలయంలో ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు చేతుల మీదుగా కృష్ణ శ్రీ రచించిన 'చిరుదివ్వెలు వెలిగిద్దామా" పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని జరిపారు. కవి, అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కృష్ణశ్రీ మాట్లాడుతూ దేశభక్తి, మానవ సంబంధాల పట్ల ప్రేమ, జీవన నైపుణ్యాలు అలవర్చుకోవడం ద్వారా ధార్మిక జీవనం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సత్తిపండు, కృష్ణ, మోదుకూరు శ్రీను, చిన్న, భగవాన్, సింగుబాబు, సూర్యనారాయణ, సత్తిబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

అమలాపురంలోని రజక వనసమారాధలో చిన్నారుల డ్యాన్స్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ఆదివారం కార్తీక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. వనసమారాధనలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

అమలాపురం: రజకులు సామాజికంగా ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించాలని రజక నాయకులు పిలుపునిచ్చారు. అమలాపురం పట్టణం స్థానిక వడ్డెగూడెంలో ఆదివారం రజక వన సమారాధన ఘనంగా నిర్వహించారు.ఈ రజక వన సమారాధనకు అధిక సంఖ్యలో రజక యువతి, యువకులు హాజరై ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా రజక పెద్దలు మాట్లాడుతూ రజకుల అభి అందరూ కషి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగా మన రాష్ట్రంలో కూడా రజకులను ఎస్‌సిల జాబితాలో చేర్చే విధంగా పార్లమెంటులో తక్షణం చట్టం చేసి అమలకు ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరారు. రజకులకు 50 సంవత్సరాలకే పింఛను అమలు చేస్తామని ఇచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఆ హామీ నెరవేర్చాలని కోరారు. రజక వృత్తిదార్లు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారి అభివద్ధికి సహకరించాలని కోరారు . భవిష్యత్తులో జరిగే ఎస్‌సి సాధన ఉధ్యమానికి యువత సహకరించాలని ఆకాంక్షిం చారు. ఈ సందర్భంగా పిల్లలు, విద్యార్థులు, మహిళలకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి వాటిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పేట వెంకటేశ్వర్రావు, మాచవరపు కామేశ్వర్రావు, చెయ్యేటి కిరణ్ కుమార్, పేట మణికంఠ, పేట హనుమంతు, యు.శ్రీనివాసరావు ఆహ్వాన కమిటీ రజక పెద్దలు, యువత పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వన సమారాధనలు నిలుస్తాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ళ లీలా కష్ణ పేర్కొన్నారు. నేలటూరులో పట్టాభి రామస్వామి, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీల ఛైర్మన్లు గుబ్బల సూర్యనారాయణ, అల్లం శ్రీనివాస్, ఇఒ ఎం.శ్రీదేవి, ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో వారు పాల్గొని మాట్లాడారు. అలాగే కపిలేశ్వరపురంలో శ్రీకష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అలాగే ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తనయుడు తోట పథ్వీరాజ్ వన సమారాధనలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎఎంసి మాజీ ఛైర్మన్ పువ్వల చిట్టిబాబు, ఆయా గ్రామస్తులు, కాపు సంఘం నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నేలటూరులోని వన సమారాధనలో పాల్గొన్న ఎంఎల్ఎ వేగుళ్ల

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కొత్తపేట

మండలం వానపల్లి జడ్‌పి ఉన్నతపాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పలివెల లావణ్య జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీల కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ముద్రగడ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 8, 9వ తేదీలలో బాపట్ల జిల్లా చీరాల లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో విజయం సాధించి ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని లావణ్య ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 15న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. వెంకటరమణ, కె.అగ్నికుమార్, విద్యార్థిని లావణ్యాను హెచ్ఎం వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, విద్యాకమిటీ ఛైర్మన్ వి.శ్రీనివాసరావు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థిని లావణ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో జరిగిన సూర్య బలిజ సంక్షేమ సంఘం వన సమారాధనలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, తుమ్మల పద్మజ, బడుగు శ్రీకాంత్, బిక్కిన విశ్వేశ్వరరావు, పొలమరశెట్టి సత్తిబాబు, చెరుకూరి రవికృష్ణ, రంది సత్యనారాయణ, అన్నాబత్తుల అంజిబాబు పాల్గొన్నారు.



జార్జి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

జార్జి మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎమ్ఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు వంగలపూడి జార్జి మృతి పార్టీకి తీరని లోటని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ మధుర పేటకు చెందిన ఎమ్ఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు వంగలపూడి జార్జి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదివారం ఎంఎల్ఎ ఆనందరావు పరామర్శించారు. జార్జి చిత్రపటానికి ఎంఎల్ఎ ఆనందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జి కుమారుడు నరసింహమూర్తి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గొలకోటి చిన్న, నాయకులు సలాది శ్రీనివాసరావు, చిక్కం భీముడు, పోలిశెట్టి శివ, మధుర ప్రతాప్, తొత్తరమూడి విజయ్ కుమార్, కుంచే మోహనరావు, గెడ్డం మోహన్ తదితరులు ఉన్నారు.

కుటుంబసభ్యులతో అప్పారావు

ఘనంగా అప్పారావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండలంలో జి.మూలపొలం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న యర్రగురువు గ్రామంలో సీనియర్ వైసిపి నాయకులు రేవు అప్పారావు 70వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకుడు రేవు చిన ధనరాజు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, ముఖ్యమైన నాయకుల సమక్షంలో శనివారం రాత్రి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్నవారికి విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కాటం సత్తిరాజు, మందపాటి భైరవస్వామి, కందికట్ల బాలయోగి, దండుప్రోలు వెంకటరమణ, ఉండ్రు గంగాధర్, లంకే సత్యనారాయణ, బొంతు అప్పలరాజు, కొండయ్య,కాలాడి గంగాధర్, కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని అన్నాయిపేట గ్రామంలో ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటాస్వదేశీ స్టిక్కర్స్ అంటించి గ్రామస్థులకు స్వదేశీ వస్తువులు వాడకంపై అవగాహన కల్పించారు. స్వదేశీ మన జీవన విధానంలో భాగంగా అలవర్చుకోవాలని గ్రామస్తులకు సూచిస్తూ నాయకులు, గ్రామ యువత అందరూ కలిసి స్వదేశీ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అనాలా పాపారావు, ఆకేటి శ్రీకృష్ణ, హసన్ బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, యువమోర్చా నాయకుడు తోలేటి సూర్య, అన్నాయిపేట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రౌతులపూడి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ బి.సూర్యఅప్పారావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఎం.కొత్తూరు పంచాయతీ దిగువ దారపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల కు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, సారా వంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు కాకినాడ

MVOP.No.113/2024

Between:-

పొలినాటి ప్రసాదరావు ...పిటీషనర్

మరియు

ఓలేటి దినేష్ వగైరాలు ...రెస్పాండెంట్స్

R2. జామి సీతారామ్ S/o. అప్పారావు డోర్ నెం.4-4-032, కాకివారి వీధి, యానం, పుదుచ్చేరి.(కారు యజమాని బెరింగ్ నెం.PY04 A 8572)

పై నంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయినన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాల యాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం **28-11-2025**వ తేదిన వాయిదా అయివున్నది. ఆరోజు ఉదయం **గం॥10.30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)

K.V.Bhadra Rao
K.Srivani
K.S.Chandra Rao
Advocates, Kakinada
9440177063

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు కాకినాడ

E.A.No.353/2025 in E.A.No.354/2025 in E.A.No.309/2025 in O.S.No.63/2008

మధ్యన

1). శ్రీమతి చెరుకూరి కామాక్షి వగైరాలు ...పిటీషనర్లు

మరియు

1). తుమ్మల రామస్వామి (డైడ్) వగైరాలు ...రెస్పాండెంట్లు

టు

R3. పిన్నం వెంకట సుబ్బారావు, తండ్రి. బ్రహ్మం, వ్యసాయం,డో.నెం.1-69, మర్లలోవ గ్రామం, పెద్దాపురం మండలం.

R4. శ్రీమతి పిన్నం పద్మావతి, భర్త వెంకట సుబ్బారావు, గృహిణి, డోర్‌నెం.1-69, మర్లలోవ గ్రామం, పెద్దాపురం మండలం

పై నెంబరు కేసులో మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిన పుచ్చుకొనక తిప్పి వేయుచున్నారు. పై నెంబరు కేసు మరియు E.A.No.353/2025 , E.A.No. 354/2025 లలో **ది.01-12-2025**వ తేది ఉదయం **గం.10.30ని॥లకు** పై కోర్టులో వాయిదా అయివున్నది. కావున మీరు స్వయముగా కాని లేక ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయి ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల పరోక్షమునందు తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వి.కేశవరమణరావు,అడ్వకేట్,
డోర్‌నెం.25-5-20,
వినుకొండవారి వీధి
కాకినాడ, సెల్.9848048497